విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

పరవాడపాలెంలో త్వరలో రోడ్ల నిర్మాణం

విశాలాంధ్ర - కశింకోట: పరవాడపాలెం గ్రామంలో త్వరలో పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. కశింకోట మండలం పరవాడ పాలెం గ్రామంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

మంత్రి గుడివాడ అమర్నాథ్

ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడచిన నాలుగున్నర సంవత్సరాల జగన్మోహన్ రెడ్డి పాలనలో పల్లెలు ప్రగతి బాట పట్టాయని, ఇప్పటివరకు గ్రామాలలో చాలావరకు సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. గ్రామాలలో కనీస వసతుల నిర్మాణానికి ప్రతి సచివాలయానికి 20 లక్షల రూపాయలు నిధులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంజూరు చేశారని, గత ప్రభుత్వాలేవి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నాయ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు నమ్మి మీనా, పెంటకోట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

473 మందికి పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని నూతనంగా 473 కొత్త పింఛన్‌లు మంజూరైనట్లు ఎంపీడీవో లవ రాజు తెలిపారు. అర్హత ఉండి ఇటీవల కాలంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వివిధ గ్రామపంచాయతీలలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. లోడగలవాని పాలెంలో నూతనంగా 20 మందికి, వేములవలస సచివాలయం పరిధిలో ఉన్న బీపీ కల్లాలు, వేములవలస పంచాయతీలకు 22 పింఛన్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోడగల రాజేశ్వరి రమణ, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి అప్పారావు, గ్రామ కార్యదర్శి అనురాధ, ఎంపీటీసీ రౌతు శ్యామల వెంకట్రావు, వేములవలస సచివాలయం పరిధిలో జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, మండల కన్వీనర్లు కోన శ్రీనివాసరావు, కోరాడ అప్పలస్వామి నాయుడు, పంచాయతీ కార్యదర్శులు నర్సింగరావు, గంగాధర్ పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై గీతంలో సదస్సు

విశాలాంధ్ర - మధురవాడ: దేశ రక్షణ, ఆర్థిక రంగాలలో సమాచార భద్రతకు ఉపకరించే క్వాంటమ్ కంప్యూటింగ్‌పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సదస్సును నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (ఐఇఇఇ) విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు కలకత్తా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ వి.కె.చౌదరి ముఖ్య అతిథిగా హాజరై వివిధ రంగాలలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రయోజనాలను ఆయన వివరించారు. గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ సి.విజయశేఖర్, గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష, ఐఇఇఇ విద్యార్థి విభాగం అధ్యక్షురాలు ఎం.ఎల్.ఐశ్వర్య, ఫ్యాకల్టీ సలహాదారు డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

విశాలాంధ్ర - పద్మనాభం: పౌష్టికాహారంతో ఆరోగ్యం చేకూరుతుందని డీఆర్డీఏ పథక సంచాలకులు ఎమ్మెస్ శోభారాణి అన్నారు. మండల కాంప్లెక్స్‌లో ఉన్న వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమైక్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. సొంతంగా నాటు కోళ్ల పెంపకం, కిచెన్ గార్డెన్, న్యూట్రిషన్ గార్డెన్స్ సొంతంగా పెంచుకొని వాటి నుంచి వచ్చిన పంటనే ఆహారంగా తీసుకుంటే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా మహిళలందరూ కూరగాయల పంటలు వేసుకోవడానికి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సత్యమనాయుడు, ఏపీఎం ప్రభాకర్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్రంలో బ్రిటిష్ పాలనను తలతన్నే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు విమర్శించారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా పాయకరావుపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుట్ర పూరితంగానే చంద్రబాబు నాయుడిని అరెస్టు చేశారన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పార్టీ నాయకులే కాక ఐటీ ఉద్యోగులు సైతం నిరసనలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ అరాచక పాలనకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవవరపు ఆనంద్ కుమార్, కలిగట్ల శ్రీను, గొల్లపల్లి నాగు, సుంకర సూరిబాబు, తలారి రాజా, భజంత్రీల శివ, గంపల సుబ్బారావు, కోడూరు నూకరాజు, గంటా థామస్, కోనేటి బుజ్జి, బసనపోయిన అప్పారావు, నారపురెడ్డి నానాజీ, శివకోటి గణేష్, సఖిలేటి నాగేశ్వర రావు, ముత్తి జగదీష్, రమణ, ధనరాజు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టు అన్ని మేజర్ పోర్టులతో పోటీ పడి మూడో స్థానంలో నిలిచింది. 2023 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై నెల వరకు పోర్టుల పనితీరుపై కేంద్ర పోర్టులు నౌకాయాన జలరవాణా శాఖ కార్యదర్శి సమీక్షను నిర్వహించారు. సరుకు పరిమాణం (కార్గో వాల్యూమ్), ప్రి బెర్తింగ్ డిటెన్షన్ సమయం , టర్నెరౌండ్ సమయం, ఔట్ పుట్ పర్ షిప్ బెర్త్ డే, ఐడల్ టైం ఎట్ బెర్త్ వంటి అంశాలను మంత్రిత్వ శాఖ పరిగణలోకి తీసుకుంటోంది. ఈ అన్ని సూచీలలోనూ విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రగతిని కనబరిచింది. గత ఏడాదితో పోల్చుకుంటే నిర్దిష్ట సమయంలో పోర్టు 33.14 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి సరుకు పరిమాణంలో 3 శాతం వృద్ధిని నమోదు చేసింది. పోర్టు సాధించిన ప్రగతి పట్ల పోర్టు డిప్యూటీ చైర్ పర్సన్, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులను పోర్టు చైర్మన్ డా. ఎం.అంగముత్తు ప్రసంసించారు.

నాన్ షెడ్యూల్డ్ ఆదివాసీ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో కలపాలి

విశాలాంధ్ర - గొలుగొండ: నాన్ షెడ్యూల్ ఆదివాసీ గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నీళ్ళ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం నిమ్మగెడ్డ గ్రామంలో ఆదివాసీల సమస్యలపై బుధవారం సమావేశం నిర్వహించి మాట్లా డారు. ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలన్నారు. నాన్ షెడ్యూల్లో ఉన్న ఆదివాసీలు గిరిజన హక్కులను కోల్పోతున్నారని, వెంటనే 5వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నువ్వా దేవుడు, కోట అర్జునరావు, ఉల్లి తలుపులు, వాడపల్లి రమణ, పల్లి రాజుబాబు, సెగ్గే దారబాబు, సెగ్గే సింహాచలం, బోనంగి బాబురావు, దవల రాజులు, 5వ షెడ్యూల్ సాధన సంఘం జిల్లా అధ్యక్షులు సంజీవ్ వాడపల్లి, బహుజన ఐక్యవేధిక నాయకులు బి.నాగరాజు పాల్గొన్నారు.

వర్షాలతో మారుమూల గ్రామాలు జలమయం

విశాలాంధ్ర - పెదబయలు: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో గల మారుమూల ప్రాంతాలు జలమయమయ్యాయి. కనీసం నిత్యావసర సరుకుల కోసం బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వచ్చుటి వంట పొలాలు గెడ్డలను తలపిస్తున్నాయి. మారుమూల గ్రామాల్లో కల్వర్టులపై నుంచి ఉదృతంగా వరద ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. గుల్లేలు, గోమంగి, జామిగూడా, ఇంజరి, గిన్నెలకోట పంచాయతీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడటం వలన వాగులు, వంకలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి పడిన వర్షానికి గాను గోమంగి గ్రామంలో డి.బాలకృష్ణ ఇంటి గోడ కూలిపోయింది. సంబంధిత అధికారులు సర్వే నిర్వహించి తమకు నష్టపరిహారం అందించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

తూర్పు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అచ్యుతరావు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం వీరనారాయణం గ్రామానికి చెందిన దాసరి నానిబాబు కుమారుడు దాసరి అచ్యుతరావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పు కాపు సంఘం రిజిస్టర్ నెంబర్ 369/2018 ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రం జాతీయ అధ్యక్షులు చంద్రమోహన్, రాష్ట్ర అధ్యక్షులు ఆకుల అప్పలసూరినాయుడు, గిరిడా అప్పలస్వామినాయుడు, రాష్ట్ర యువజన అధ్యక్షులు శ్రీనుబాబు, గంటే మోహన్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. ఈ పదవిని తనకు అప్పగించిన జాతీయ అధ్యక్షులు పిసిని చంద్ర మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖలో అడుగుపెట్టనున్న ఇన్ఫోసిస్

కార్యాలయ భవనాలను పరిశీలించిన వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఐటి దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ అతి త్వరలోనే విశాఖలో తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ కంపెనీకి సంబంధించిన అధికారులు బుధవారం విశాఖ నగరానికి చేరుకున్నారు. ఐ.టి సెజ్ హిల్ నెంబర్ 2లో మూడు అంతస్తుల భవనంలో ఏర్పాటు చేయనున్న ఇన్ఫోసిస్ కార్యాలయ ప్రాంగణాన్ని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం పరిశీలించారు. వీరితోపాటు ఇన్ఫోసిస్ కంపెనీకి చెందిన మౌలిక సదుపాయాల విభాగం వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ నీలాద్రి ప్రసాద్ మిశ్రా, మౌలిక సదుపాయాల అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ దేశాయ్, మౌలిక సదుపాయాల రీజినల్ హెడ్ కులకర్ణి, జయచంద్రన్, వెంకటేష్ తదితరులు కార్యాలయ భవన పరిశీలనలో పాల్గొన్నారు. సుమారు 65 నుంచి 70 వేల ఎస్.ఎఫ్.టీ. కలిగిన ఈ భవనంలో కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

ఇన్ఫోసిస్ కంపెనీ కార్యకలాపాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వై.వి.సుబ్బారెడ్డి, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, హామీ ఇచ్చారు. ఈ కంపెనీ ప్రారంభోత్సవానికి సంబంధించితేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వారు తెలియజేశారు.

విలేకరులు తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవాలి

ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: విలేకరులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నిత్యం తమను తాము సరికొత్తగా ఆవిష్కరించుకోవాలని ఎస్పీ కె.వి.మురళీ కృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని ఒక హోటల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థ పత్రికా సమాచార బ్యూరో (పిఐబి) నిర్వహించిన విలేకరుల శిక్షణా కార్యక్రమం (వార్తా లాప్)కి ఆయన హాజరై మాట్లాడారు. సమాచార వ్యవస్థ సమాజాన్ని మంచి మార్గం వైపు, ఆధునికత వైపు పయనింపజేస్తుందన్నారు. ఇటీవల కాలంలో సమాచార వ్యవస్థ వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, యూ ట్యూబ్‌లను ఉపయోగించుకుని మరింత విస్తృతమైనట్లు చెప్పారు. పత్రికలలో నాణ్యతను మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. కేంద్ర సమాచార బ్యూరో జాయింట్ డైరెక్టర్ పి.రత్నాకర్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రజలకు అందించే సమాచారం, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గూర్చి వివరించారు. విపత్తుల సమయంలో అసత్య సమాచారం పుకార్ల రూపంలో వ్యాప్తి చెందకుండా నిజ నిర్ధారణ సమాచారం తమ శాఖ ద్వారా అందించబడుతుందన్నారు. www.rni.in వెబ్ సైట్ ద్వారా కేంద్ర ప్రభుత్వ వార్తలను, ప్రధానమంత్రి ఇతర మంత్రులు పాల్గొన్న కార్యక్రమాలను మీడియా వారికి అందించడం జరుగుతుందన్నారు.

వ్యాధులు, ప్రమాదాలకు గురైన పాత్రికేయులకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష నుండి రూ.5 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు, వైజాగ్ రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వి.వి.రమణమూర్తి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, సమాచార హక్కు చట్టం కార్యకర్త, పాత్రికేయులు కాంద్రేగుల వెంకటరమణ, పిఐబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హల్లి కేరి, పిఐబి మీడియా కమ్యూనికేషన్ అధికారి టి.హెన్రీ రాజ్, డీపీఆర్‌ఓ డి.సాయిబాబా పాల్గొన్నారు.

సైకో పాలనకు త్వరలోనే చరమగీతం

టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: సైకో జగన్మోహన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా వంగలపూడి అనిత ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అనిత మాట్లాడుతూ సైకో, ఉన్మాదిలా వ్యవహరిస్తున్న జగన్, చంద్రబాబుతోపాటు అందరిపై కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. జగన్ 16 నెలలు జైల్లో ఉన్నాడని, చంద్రబాబు నాయుడును 16 రోజులైనా జైల్లో ఉంచాలని కుట్ర పన్నుతున్నారని తెలిపారు. 45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబును జైల్లో పెట్టించడాన్ని రాష్ట్ర ప్రజలేకాక ప్రపంచ దేశాల్లో తెలుగుదేశం అభిమానులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, మల్లపురెడ్డి రమాకుమారి, లాలం కాశీ నాయుడు, యేజర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్దం, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, యాళ్ల వరహాల బాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, దేవవరపు వెంకట్రావు, వంకా రమణ, పల్లా విలియంకేరి, జూరెడ్డి ప్రసాద్, చిక్కాల శ్రీను, చించలపు ప్రదీప్, బొంది కాశీవిశ్వనాద్, కశింకోట సత్తిబాబు, వేములపూడి అప్పారపావు, గుల్లా నాగరాజు, ఏడిద సురేష్, చిరుకూరి పేర్రాజు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

విశాలాంధ్ర - పరవాడ: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా వాడచీపురుపల్లిలో మాజీ ఎంపీపీ మాస వరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ శ్రేణులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్రంలో నాలుగేళ్ల నుంచి చీకటి రోజులు మొదలయ్యాయని.. మచ్చ లేని తమ నాయకుడు చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి రిమాండుకు పంపడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల జగన్నాధరావు, గండి రవికుమార్, రెడ్డి నారాయణరావు, పాల అచ్చిలనాయుడు, ఇందల కొండలరావు, నగిరెడ్డి చిన్నారావు, పైల వరలక్ష్మి, బొండా సన్నిదేముడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగ బోర్డు సభ్యునిగా భాస్కరరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగ బోర్డు సభ్యునిగా గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షుడు, జిల్లా అప్సా ప్రధాన కార్యదర్శి పాలవలస భాస్కరరావు ఎన్నికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి యల్.చంద్రకళ ప్రకటించారు. ఈ సందర్భంగా జిప్సా, అప్సా సభ్యులు బుధవారం ఆయన్ను పుష్పగుచ్ఛంతో సత్కరించి, అభినందించారు. ఆయన్ని సత్కరించిన వారిలో అప్సా జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ట్రెజరర్ శ్రీనివాస్, జిప్సా కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, మురళీసుందర్, రమేష్ నాయుడు, రామకృష్ణ తదితరులున్నారు.

ఏఐఎస్ఎఫ్ పెందుర్తి కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - పెందుర్తి: ఏఐఎస్ఎఫ్ పెందుర్తి నియోజకవర్గ అధ్యక్షులుగా గుడబండి మార్తా, కార్యదర్శిగా కొల్లి జయవర్ధన్, సహాయ కార్యదర్శిగా మణికంఠ, ఉపాధ్యక్షురాలుగా లత, కోశాధికారిగా భువనేశ్వరి, కార్యవర్గ సభ్యురాలుగా ప్రణిత, అచ్యుత్‌రావులను ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, అధ్యక్షులు శ్రీను తెలియజేశారు. ఈ కమిటీ ద్వారా రానున్న రోజుల్లో పెందుర్తిలో విద్యారంగ సమస్యలపై నిర్వి రామ పోరాటానికి సిద్ధమవుతున్నామని స్పష్టం చేసారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

విశాలాంధ్ర - యస్.రాయవరం: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం మండలంలో దార్లపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవ లక్ష్మి, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకినాయుడు, కశింకోట నీలాద్రిరావు, పోలిశెట్టి సతీష్, నల్ల మారి రమణ, కుసుమంచి శ్రీను పాల్గొన్నారు.

ప్రతిభ హైస్కూల్‌లో దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో గల ప్రతిభ హై స్కూల్‌లో ప్రదానోపాధ్యాయురాలు తోనంగి వెంకటరమణి ఆధ్వర్యంలో మెగా దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. డైరెక్టర్ హరికిశోర్, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ గాయిత్రి విద్యార్థులను దంత సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా వంతల

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట మండల కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడుగా వంతల రామకృష్ణ నియామకం అయినట్టు ఆదివాసి కాంగ్రెస్ చైర్‌పర్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి శాంతకుమారి తెలిపారు. తడిగిరి పంచాయతీ కొండ చీడీపుట్టు గ్రామానికి చెందిన రామకృష్ణ నియామకంతో కాంగ్రెస్ పార్టీకి మండలంలో పూర్వ వైభవం వస్తుందన్నారు. మండలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా కాంగ్రెస్ ఆశయాలకు లోబడి పనిచేయాలని ఆమె కోరారు.

లక్ష్మీపురం గ్రామంలో ఎంపీపీ పర్యటన

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఎంపీపీ శెట్టి నీలవేణి బుధవారం పర్యటించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ముందుగా సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న విద్యోపకరణాలను ఉపయోగించి మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించి అక్కడ అందుతున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పసిడి కాంతులతో సింహాద్రి అప్పన్న ధ్వజస్థంభం

విశాలాంధ్ర-సింహచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి ధ్వజస్థంభం పసిడి కాంతులతో రూపుదిద్దుకుంది. ఇది ఒక స్తంభం మాత్రమే కాదు.. ఆలయంలో మూలవిరాట్టు ఎంత ముఖ్యమో ధ్వజస్తంభం కూడా అంతే ముఖ్యం. ధ్వజస్తంభం ఉంటేనే దేవాలయానికి ఆలయత్వం ఉంటుంది. సుమారు రూ.కోటి అరవై లక్షల రూపాయల వ్యయంతో అప్పన్న స్వామి ధ్వజస్థంభం పొడవు 42 అడుగులు, చుట్టూ కొలత 360 చదరపు అడుగులు, ఒక చదరపు అడుగుకు 5 గ్రాములు బంగారంను ధ్వజస్తంభ రాగి తాపడంపై 1.5 కిలోలతో స్వర్ణపూత పనులు విశాఖ నగరంలోని ప్రముఖ బంగారం, వస్త్రాల వ్యాపార సంస్థ అధినేత మావూరి వెంకటరమణ విరాళంగా సమర్పించారు. చెన్నైకి చెందిన స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ ధ్వజస్తంభం స్వర్ణ తాపడం పనులు పూర్తి చేశారు. బుధవారం ఉదయం ఇన్‌చార్జ్ ఈఓ త్రినాధరావు సమక్షంలో ప్రధాన రాజగోపురంలో ఉన్న ధ్వజస్థంభానికి బంగారు పూత వేసిన తొడుగులు వేయటం, సాయంత్రం సంప్రోక్షణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కొండక్రింద దివిస్ సంస్థ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 2 మంచినీటి ప్లాంట్‌లను ఈఓ ప్రారంభిం చారు. కార్యక్రమంలో డి.ఈఓ సుజాత, ఏఈఓ సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునిల్, ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు, స్థానాచారులు టి.పి.రాజ గోపాల్, అలంకారి కరి సీతారాం, ఎప్రైజర్ సాంబ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DIST. CONSUMER DISPUTES REDRESSAL COMMISSION:: GUNTUR
C.C No: 145 of 2023
Between :
Chebrolu Krupanandam - Complainant
And
The Branch Manager, Kallas Chemicals. -Opposite Party
To,
The Branch Manager, Kallas Chemicals, Prakashrao Pet, Nehru Nagar, Ram Nagar, Vishakhapatnam -530020
పై నెంబరు C.C లో ఆపోజిట్ పార్టీ అయిన మీకు గౌరవ కమిషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీకు ముట్టనందున గౌరవ కమిషన్ వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:22-09-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన శ్రీయుత కమిషన్ వారి యెదుట మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
వాయిదా తేదీ:22-09-2023
(శ్రీయుత కమిషన్ వారి అనుమతితో)
యం.వి.వి.యస్.రాజు, కంప్లైనెంట్ తరపు అడ్వకేట్, మల్లికార్జునరావు పేట, గుంటూరు, సెల్:9347379593

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు దివ్యసముఖమునకు
O.S.175/2022
బిట్వీన్:
గెంబలి గోపాలకృష్ణమూర్తి ...వాది
ఎండ్:
సూరి మధుసూదనరావు ..ప్రతివాదులు
టు,
సూరి మధుసూదనరావు తండ్రి లేటు శ్యామ సుందరరావు, వయస్సు 35 సం.లు, హై స్కూల్ రోడ్డు, కొత్త గాజువాక, విశాఖపట్నం.
పై నెంబరు దావాలో యిందలి ప్రతివాదిపై సొమ్ము రాబట్టే నిమిత్తం పై కోర్టులో దావా దాఖలు చేసియున్నాను. సదరు దావా వాయిదా తేది.26.09.2023కి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో ఉదయం 10.30 గంట లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.
బై ఆర్డరు
బొబ్బిలి
తేది: 12-9-2023
కండాపు ప్రసాదరావు
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్,బొబ్బిలి

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు దివ్యసముఖమునకు
E.P.26/2022 IN O.S.48/2014
బిట్వీన్:
మెండా విజయలక్ష్మి ...డిక్రీ హోల్డర్
ఎండ్:
తూముల చిన్నవాడు ...జె.డి.ఆర్
టు,
తూముల చిన్నవాడు తండ్రి లేటు పైడియ్య, వయస్సు 70 సం.లు, రిటైర్డ్ ఉద్యోగి, ఎఫ్.సి.ఐ. అడిషినల్ న్యూ గొడౌన్స్, పోర్టు ఏరియా, విశాఖపట్నం.
పై నెంబరు అమలు యిందలి జె.డి.ఆర్. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఎటాచ్ చేయిపించే నిమిత్తం అమలు దాఖలు చేసియున్నాను. సదరు అమలులో యిందలి జె.డి.ఆర్.కు ఆర్డర్ 21 రూ.లు 22 నోటీస్ జారీ చేయించి యున్నారు. సదరు అమలు వాయిదా తేది.15.09.2023కి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా దినంపై కోర్టులో ఉదయం 10.30 గం.లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు కావలను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.
బై ఆర్డరు
బొబ్బిలి
తేది: 12-9-2023
కండాపు ప్రసాదరావు
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్,బొబ్బిలి

జగనన్న కాలనీ ఇళ్లు సకాలంలో పూర్తిచేయాలి

కలెక్టర్ డా. మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో జగనన్న కాలనీ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులని ఆదేశించారు. బుధవారం జిల్లాలోని జగనన్న కాలనీ లేఅవుట్ల ఇళ్ల నిర్మాణంపై వెబెక్స్ ద్వారా జిల్లాలోని ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, జివిఎంసి, అన్ని మండలాల ఎంపిడిఓలు , గుత్తేదారులతో తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో సకాలంలో ఇళ్ల నిర్మాణం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సమీక్షలో పాల్గొన్న అధికారులను ఆయన ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గుత్తేదారు వారీగా సమీక్ష నిర్వహించారు. బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న గృహాలన్నీ బేస్మెంట్ స్థాయికి తీసుకు రావాలన్నారు. బేస్మెంట్ లెవెల్ అంతకన్నా ఎక్కువ స్థాయిలో ఉన్న గృహాలన్నీ రూఫ్ క్యాస్టింగ్ స్థాయికి తీసుకురావాలన్నారు.

అలాగే ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి స్టేజి అప్డేషన్ చేయాలన్నారు. ఈ వెబెక్స్ సమావేశంలో జివిఎంసి కమీషనర్ సిఎం సాయి కాంత్ వర్మ , హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, వీఎమ్మార్డీఏ అధికారులు, ఈపీడీసీఎల్, మండల పరిధిలోని ఎంపీడీఓలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నిరసన దీక్షను భగ్నం చేసిన పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: టీడీపీ నేతలపై అరెస్టుల పర్వం కొనసాగుతూనే ఉంది. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద టీడీపీ తలపెట్టిన నిరాహార దీక్షలను పోలీసులు ఎక్కడికక్కడ భగ్నం చేశారు. ఎమ్మెల్యే గణబాబును ఇంటి వద్ద హౌస్ అరెస్ట్‌కు పూనుకున్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్షకు బయలుదేరిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబును, విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. పలువురు నేతలను, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అటు పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ఆధ్వర్యంలో నిరాహారదీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు నివాసం వద్ద ఉత్తర నియోజకవర్గం టీడీపీ శ్రేణులతో నిరాహార దీక్ష చేశారు. పార్టీ కార్యాలయంలో మీతోనే మేము బాబు కార్యక్రమానికి సంతకాల సేకరణ చేపట్టారు.

చోడవరంలో పడకేసిన తెలుగుదేశం

విశాలాంధ్ర - చోడవరం: ఏ.వి. మాజీ సి.ఎం., తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు కారణంగా రాష్ట్రమంతటా ఆందోళనలు, నిరాహార దీక్షలు తలపెట్టిన వేళ, చోడవరంలో తెలుగుదేశం పడకేసిందని పార్టీ అభిమానులు విస్తుపోతున్నారు. చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యంలో రోలుగుంట తో సహా మూడు మండలాల్లో బుధవారం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తమ నాయకుడు చంద్రబాబు అరెస్ట్ కి నిరసనగా నిరాహార దీక్షలకు దిగారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడుల నేతృత్వంలో సోమవారం ఒక రోజు బంద్ పాటించి, మమ అనిపించి, చోడవరం మండలంలో పార్టీని పడుకోబెట్టారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికల నుండి అంటి ముట్టనట్లు వ్యవహరిస్తున్న స్థానిక నేతల తీరు తెలుగుదేశం అభిమానులను నిరుత్సాహపరుస్తుందని టి.డి.పి. అభిమానులు ఆందోళన

చెందుతున్నారు. పార్టీ అధ్యక్షుడు జైలుపాలైన సందర్భంలో, జనసేన నేత పి.వి.ఎస్.ఎన్.రాజు అధ్యక్షుల వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కష్టకాలంలో యువ గళం లోకేష్ బాబుకు మేము వున్నాము అనే భరోసా ఇచ్చారు. కనీసం జనసేన నేతల వలె చంద్రబాబు కుటుంభానికి, భరోసా ఇవ్వకపోయినా స్థానికంగా టి.డి.పి.ను బ్రతికించే పరిస్థితి కానరావడం లేదు. రానున్న 2024 ఎన్నికల్లో పార్టీ అధిష్టానం చోడవరం ఎమ్మెల్యే టికెట్ కాపు సామాజిక వర్గానికి కేటాయిస్తారని స్పష్టమైన సంకేతాలు వస్తుండటంతో ఇక్కడి నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని భోగట్టా. ఈ నేపథ్యంలో బుచ్చయ్యపేట మండలం నుండి కాపు సామాజిక వర్గానికి చెందిన బత్తుల. తాతయ్య బాబుకు టి.డి.పి. ఇన్చార్జి పదవి కట్ట బెట్టడం మాజీ ఎమ్మెల్యే తో సహా వారి వర్గ నేతలైన మల్లునాయుడు, పెదబాబు, పెద్ద అచ్చి బాబు తదితరులకు మింగుడు పడడం లేదని, అభిమానుల్లో గుస గుసలు నాటి నుండి వినపడుతున్నాయి.

జగనన్న ఆరోగ్య సురక్ష - శ్రీరామరక్ష

విశాలాంధ్ర - కొయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు శ్రీరామరక్ష వంటిదని ఎంపీడీవో లాలం సీతయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై ఎంపీడీవో సీతయ్య ఎంఎల్ఓ సాగిన లోవరాజులు గ్రామ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొయ్యూరు రాజేంద్రపాలెం చీడిపాలెం మర్రివాడ బూదరాళ్ల ఎం.మాకవరం సచివాలయాల పరిధి గ్రామ వాలంటీర్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో సీతయ్య ఎంఎల్ఓ లోవరాజులు మాట్లాడుతూ ప్రతి ఒక్క గ్రామ వాలంటీర్ జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి సంబంధిత గ్రామ వార్డు యాప్ లో సర్వే నిర్వహించాలన్నారు. వాలంటీర్లు ఆయా పరిధి గృహాలను సందర్శించి కుటుంబంలో గల ప్రతి ఒక్కరి ఆరోగ్యం పై వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమలుపరుస్తుంది అన్నారు. ఈ నెల 14 గురువారం మండలంలోని ఆడాకుల, బకులూరు, కంతారం కొమ్మిక, కొండగోకిరి, బంగారంపేట 1, 2, శరభన్నపాలెం 1, 2, నడింపాలెం సచివాలయాల పరిధి గ్రామ వాలంటీర్లకు కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో గల సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందన్నారు. నేటి కార్యక్రమానికి ఆయా సచివాలయాల పరిధి గ్రామ వాలంటీర్‌లంతా విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సీతయ్య, ఎంఎల్ఓ లోవరాజు కోరారు.

వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చింతపల్లి :- వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణను గిరి యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పాడేరు ఐటీడీఏ ద్వారా వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ గిరిజన యువతకు వారికి నచ్చిన వృత్తిలో నైపుణ్యతను పెంపొందించే విధంగా శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకరం చుట్టిందనీ, దీనికి సంబంధించి మండలంలోని గిరిజన యువతి యువకుల నుండి దరఖాస్తులు కోరడం జరిగిందని దీనికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాల్సి ఉందన్నారు. గిరిజన యువత టైలరింగ్, పర్యాటకా మరియు ఆతిథ్యం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్లంబింగ్, ఆటోమోటివ్, సెక్యూరిటీ గార్డ్స్, తాపీ పని తదితరవృత్తులలో వృత్తి నైపుణ్య శిక్షణ కై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఈనెల 20 లోపు దరఖాస్తులు తమ కార్యాలయ పని దినములలో అందజేయాలని, ఈ దరఖాస్తులకు సంబంధించి అభ్యర్థులు తమ పేరు, తండ్రి పేరు, గ్రామము,

పంచాయతీ, మండలం, గిరిజన తెగలోని ఉపకులం వయసు, విద్యార్హత, ఆధార్, మొబైల్ నెంబర్ల తో పాటు ఏ వృత్తిలో నైపుణ్యానికి దరఖాస్తు చేస్తున్నది తెలియపరచాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఒమ్మలిలో నా భూమి నా దేశం



విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఒమ్మలి గ్రామంలో బుధవారం నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాండ్ బాజా భజంత్రీలతో, సౌండ్ సిస్టంతో గడపగడపకు వెళ్లి మట్టి సేకరణ చేయడం జరిగిందని మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఉండూరు రాజు తెలిపారు. అమరవీరుల శఅతి వనం నిమిత్తం మట్టి సేకరణ చేశామన్నారు. అనంతరం విశ్రాంతి ఆర్మీ ఉద్యోగి జన్నపల్లి శివ గణేష్‌కు సన్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మేడపురెడ్డి శ్రీనివాసరావు, చీడికాడ మండల పార్టీ అధ్యక్షుడు పరవాడ మురళీ, బిజెపి లీడర్ మాడుగుల మండల సతీష్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషణ మహా కార్యక్రమం గర్భిణీలు, బాలింతలు, శిశువులకు వరం

విశాలాంధ్ర - చింతపల్లి :- పోషణ మహా కార్యక్రమం గర్భిణీలు, బాలింతలు, శిశువులకే గాక ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగమని ఐసిడిఎస్ సిడిపిఓ జివి రమణి అన్నారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా కిటుముల పంచాయతీ బౌడ గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త కృష్ణవేణి ఆధ్వర్యంలో సూపర్వైజర్లు సత్యవతి, విజయ కుమారి ల పర్యవేక్షణలో బుధవారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏ సిడిపిఓ రామలక్ష్మి తో కలిసి ఆమె విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిటుముల ఎంపీటీసీ సభ్యురాలు వనుము పద్మ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ రమణి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎం ఎల్ హెచ్ పి కొరుప్రోలు సౌజన్య గర్భిణీలు, బాలింతలతో పాటు కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ ఆరోగ్యానికి సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తూ..తూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

సమస్యలపై గగ్గోలు పెడుతున్న ప్రజాప్రతినిధులు
పెడ చెవిన పెడుతున్న అధికారులు
తొమ్మిది సమావేశాలు సాక్షిగా సమస్యలు పరిష్కారం శూన్యం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అదేంటో ... సమావేశాల్లో సమస్యల ప్రస్తావనే తప్ప వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే నాయకులు, అధికారులు లేకపోవడం విడ్డూరంగానే ఉంటుంది.. మైకు పట్టుకుని సమస్యలు పరిష్కారం కాలేదని ఊగిపోయే ఎంపీటీసీలు, సర్పంచులు.. పరిష్కరిస్తామంటూ కూల్ గా సమాధానం చెప్పే అధికారులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు... 9 మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాల సాక్షిగా సాగుతున్న తంతు విడ్డూరంగాను, విచిత్రంగాను ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.. బుధవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమస్యలు పరిష్కారం కాలేదంటూ ఎంపీటీసీలు, సర్పంచులు తీవ్ర అసహనం వ్యక్తం చేయడం సమావేశాల తీరుకు అద్దం పడుతుంది..తుమ్మపాల ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు

అయితే తుమ్మపాలలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు గత సర్వసభ్య సమావే శాల్లో ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. క్వారీల నిర్వహణ ద్వారా కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని దీంతో పెద్ద సంఖ్యలో ప్రజలు రోగాల భారిన పడుతున్నారని ఆరోపించారు. దీని పై మైన్స్ ఏడీ సమాధానం చెప్పాలని కోరగా మైన్స్ ఏడీ సుబ్బారాయుడు కాలుష్యానికి సం బంధించి తమ శాఖ పరిధి కాదంటూ సమాధానమివ్వడంతో ప్రజా ప్రతినిధులు అసహనానికి య్యారు. వెంకదుపాలెం ఎంపీటీసీ రాపేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ .గ్రామాల్లో రాత్రి వేళల్లో బ్లాస్టింగ్లు నిర్వహిస్తూ అక్రమ మైనింగ్కు పాల్పడు.. తున్నా మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి మండలంలో భారీగా అక్రమ మైనింగ్ జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఎంపీటీసీలు ఆరోపించారు. ఇలా ఏ సమస్యపై మాట్లాడిన అటు అధికారులు కానీ, ఇటు ఎంపీపీ గాని సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేసే ధోరణిలో వ్యవహరించడం విడ్డూరంగా ఉందని ఎంపీటీసీలే వాపోయారు. సమస్యల పరిష్కారం పై కాకుండా తమకు లబ్ధి చేకూర్చే ఫైల్స్ పరిష్కారం పైనే మండల పరిషత్ అధికారులు, అధ్యక్షులు దృష్టిని కేంద్రీకృతం చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి ఉపయోగపడని సర్వసభ్య సమావేశాలు ఎందుకంటే ఎంపీటీసీలు సర్పంచులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సమావేశంలో ఎంపీడీవో నరసింహరావు, పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాలరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీలు సూర్యకుమారి, రాము తదితరులు పాల్గొన్నారు.

కడిగిన ముత్యంలా బాబు బయిటకు వస్తారు

విశాలాంధ్ర - పెందుర్తి: టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ రిమాండ్‌ను నిరసిస్తూ టీడీపీ పెందుర్తి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి లిబాబుతో నేనులి అను ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అదేవిదంగా బాబుకు తోడుగా...నియంతతో పోరాటానికి మేము సైతం అని నినాదాలు చేశారు. పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్ర బాబునాయుడుపై కక్షతో జగన్ రెడ్డి ఏ తప్పు లేకపోయినా దొంగ కేసులు పెట్టి రిమాండ్ లో పెట్టారన్నారు. తప్పు చేయలేదు కాబట్టే ఇప్పటి వరకు బెయిల్ పిటిషన్ వేయలేదని, క్వాష్ పిటిషన్ మాత్రమే వేశారన్నారు. ఈ కేసు నుండి కడిగిన ముత్యంలా బాబు బయిటకు వస్తారని, ప్రజ లన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో బాబును ముఖ్యమంత్రిని చేస్తారన్నారు. కార్యక్ర మంలో వార్డు అధ్యక్షులు వేగి పరమేశ్వరరావు , మండల అధ్యక్షులు కరక దేవుడు, 96వ వార్డ్ యువత అధ్యక్షుడు పీలా జితేంద్ర,ప్రధాన కార్యదర్శి బండారు నాగు, జిల్లా కార్యదర్శి ఆళ్ల రమేష్,నగేష్, క్లస్టర్ ఇంచార్జ్ పెంటకోట రాజేంద్రప్రసాద్, కిల్లి రమేష్, వానపల్లి నరసింగరావు, పెంటకోట శ్రీను ,చంద్రమౌళి, రాంబాబు నావేటి శీను, ఆళ్ల జగదీష్ పాల్గొన్నారు

నూతన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసీపీ నాయకులు పంపిణీ చేశారు. రాజవరం గ్రామంలో కొత్తగా మంజూరైన 17 పింఛన్లను సర్పంచ్ గోసల అమ్మాజి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి గోసల మరిణమ్మ, గోసల రమణ, గొసల జగన్నాథం, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ వైసీపీ ప్రభుత్వం పెన్షన్లను అందిస్తుందని ఎస్‌సీఎస్ కన్వీనర్ కందుల బాబ్జీ అన్నారు. బుధవారం ఎంపిపి కుంజమ్ మురళీ చేతుల మీదుగా మంజూరైన కొత్త పెన్షన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో ఎవ్వరూ ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఎప్పటికప్పుడు సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చర్యలు తీసుకుంటూ ప్రజా సంక్షేమ ప్రభుత్వము గా ప్రజల్లో ఆదరణ సంపాదించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గారపాటి మురళీ కృష్ణ, జెడ్పీటీసీ శీర్షం సత్య వేణి, శీర్షం పెద్ద అబ్బాయి దొర పాల్గొన్నారు.

అనంతగిరి: అనంతగిరి మండల పరిధిలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో 248 మంది వృద్ధులకు వితంతువులకు నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీపీ శెట్టి నీలవేణి బుధవారం విలేకరులకు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి గుర్తించి తక్షణమే పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంజూరైన పింఛన్లలను గ్రామ వాలంటీర్ల ద్వారా నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ మేరకు రెండువ విడతలో 248 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయని వాటి పంపిణీ కార్యక్రమం ప్రస్తుతం జరుగుతుందని ఆమె వెల్లడించారు. ఈ మేరకు అనంతగిరి పరిధిలో 11 భీంపోలు, 10 బొర్రా 12 ,చిలకలగెడ్డ 10, గుమ్మ 14 జీనబాడు 8, కాశీపట్నం 7 కివర్ల 2, కొండిబా 7, కొత్తూరు 5 లుంగపర్తి 15, ఎన్ ఆర్ పురం 9, పెదబిడ్డ 14, పెదకోట 23 పినకోట 21 ,పైనంపాడు 15 రొంపల్లి 5, టోకూరు 17 వాలాసి 8, ఎగువసోభ 14 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా 60 ఏళ్లు నిండిన ప్రతి వృద్ధులకు పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు.

హుకుంపేట: హుకుంపేట పంచాయతీ సచివాలయ పరిధిలో 19 కొత్త పెన్షన్లను అందించామని స్థానిక సర్పంచ్ సమీడ వెంకటపూర్ణిమ తెలిపారు. బుధవారం సచివాలయంలో లబ్ధిదారులకు సర్పంచ్ చేతుల మీదుగా పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధాప్య పెన్షన్లు 5, వితంతు పెన్షన్లు మూడు, వికలాంగుల పెన్షన్ ఒకటి పంపిణీ చేశామని ముందు పది పెన్షన్లు పంపిణీ చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శిరోమణి, నాగేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, పెన్షన్ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: అర్హత ఉన్న వారందరికి పింఛన్లు అందించడం జరుగుతుందని మాకవరపాలెం జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరినీ బతిమిలాడే అవసరం లేకుండా అర్హత ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెట్ల భద్రాచలం, వలంటీర్లు పాల్గొన్నారు.

గొలుగొండ: మండల కేంద్రమైన గొలుగొండ పంచాయతీలో కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కసిపల్లి బుజ్జి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగన్మోహన్

రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజలను ఆదుకోవడమే ప్రధాన లక్ష్యం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కొల్లా బత్తిన కళ్యాణం, గృహ సారధులు రాజాన రాజబాబు, పోరా అచ్చిరాజు, వార పైడమ్మ, ఎర్రంశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

కూనవరం: కూనవరం సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన 31 కొత్త పెన్షన్లు స్థానిక ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కూనవరం, జగ్గవరం, చూచిరేవుల గూడెం, వెంకటాయపాలెం, కాచవరం, కరకగూడెం గ్రామాల్లో సుమారు 120 కొత్త పెన్షన్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతినెలా కొత్త పెన్షన్లు మంజూరు కార్యక్రమం చేపడుతుందని జేసీఎస్ కన్వీనర్ ఆవుల మరియదాసు అన్నారు. జడ్పిటిసి గుజ్జా విజయ, వైసిపి మండల కన్వీనర్ ఆలూరి కోటయ్య, మెరుకులం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దీకొండ లక్ష్మీప్రసాద్, గంగాధర్, ఎంపీటీసీ కొమ్మని అనంతలక్ష్మి, సొసైటీ చైర్మన్ నోముల కొండలరావు, గుజ్జ బాబు, వునుగు పాటి భరతమూర్తి, స్థానిక సర్పంచ్ హేమంత్, సచివాలయం కన్వీనర్లు ఎలిపే రమేష్, జోడి లక్ష్మి, పసుపులేటి వీరబాబు, కొమ్మని సునీత, ఎస్.కె మున్నాఫ్, కొమ్మని వీర్రాజు, కూనవరపు వెంకట్రావు, డిజిటల్ అసిస్టెంట్ వేణు, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయి లక్ష్మి గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



కాపు సంఘం అధ్యక్షుడిగా వరహాలబాబు

విశాలాంధ్ర- కోటవురట్ల: పాయకరావుపేట నియోజకవర్గం కాపు సంక్షేమ సేన అధ్యక్షుడిగా పినపాత్రుని వరహాలబాబుని నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షులు గుర్రాల శ్రీనివాసరావు ఈ మేరకు నియామక నియామక పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. నియోజవర్గంలో ఉన్న కాపుల యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాపు సంఘం నాయకులు నాకు ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చి కాపు సంక్షేమానికి పాటు పడతానన్నారు. నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షుడుగాను ఆయన సేవలు అందిస్తున్నారు. అనంతరం ఆయన అనకాపల్లి జిల్లా కాపు సంఘం అధ్యక్షులు నడిశెట్టి గంగబాబు ఇతర కార్యవర్గ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

దక్షిణాది రాష్ట్రాల ఎంపీల విప్‌గా జీవీఎల్ నరసింహారావు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాజ్యసభలో దక్షిణాది రాష్ట్రాల విప్‌గా బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావును మరోసారి నియమించినట్లు బీజేపీ పార్లమెంటరీ పార్టీ ప్రకటన జారీ చేసింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల ఎంపీలకు ఎంపీ జీవీఎల్ విప్ గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా పలువురు జీవీఎల్ కు అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో వేమగిరి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అనకాపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డ్ అందుకున్న బోజంగి రామ చంద్రరావు మాస్టర్‌ను ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోతు రంగారావు మాట్లాడుతూ.. అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గౌరవం ప్రోత్సాహం లభిస్తాయి, అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కరణం శంకర మణి, అంగన్వాడి టీచర్ గెంజి వేణు, శేషు మాష్టారు, లక్ష్మణ మాష్టారు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నూకరాజు మృతి తీరని లోటు

విశాలాంధ్ర - కొయ్యూరు: కొమ్మిక మాజీ సర్పంచ్ అల్లం నూకరాజు మృతి పార్టీకి తీరని లోటు అని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయతీ మాజీ సర్పంచ్ అల్లం నూకరాజు మృతదేహానికి ప్రసాద్ నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుని కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. పంచాయతీ పరిధిలో పార్టీ

బలోపేతానికి విశేష కృషి చేసిన నూకరాజు సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ శివరామరాజు, టీఎన్ టియుసి కార్యదర్శి చిరంజీవి తదితర పలువురు నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొమ్మిక మాజీ సర్పంచ్ మృతి

విశాలాంధ్ర - కొయ్యూరు: కొమ్మిక మాజీ సర్పంచ్ అల్లం నూకరాజు అనారోగ్యంతో బాధపడుతూ నర్సీపట్నం ప్రభుత్వాసు పత్రిలో మృతి చెందారు. నూకరాజు 15 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరి క్రియాశీలక నాయకునిగా

పనిచేస్తూ మూడు పర్యాయాలు వార్డ్ మెంబర్గా ఒకసారి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అందరితో ఆప్యాయంగా కలుపుకోరుగా ఉండే నూకరాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. నూకరాజు మృతి ఆ పార్టీకి తీరని లోటని సామాజిక సేవకుడు అర్జున్ రెడ్డి పేర్కొన్నారు. అతనికి ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. రాజకీయాలకతీతంగా వివిధ పార్టీల నేతలు కార్యకర్తలు నూకరాజు కుటుంబీకులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.

పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు పౌష్టికాహారం కీలకం

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు పౌష్టికాహారాన్ని అందించడమే కీలకమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. బుధవారం మద్రిపాలెంలోని ఐసి డీస్ సిడిపిఓ కార్యాలయంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవ వేడుకలకు సీతారాం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు,సిబ్బంది తయారు చేసిన పౌష్టికాహార వంటకాల స్టాల్లను పరిశీలించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయింపులు జరుపుతున్నాయని అన్నారు. కార్బో హైడ్రేట్లు, విటమిన్లు, ప్రోటీన్లు, జింక్, కాల్షియం, సిలీనియం, ఫోలిక్ యాసిడ్, పొటాషియం, ఖనిజ లవణాలు వంటి సూక్ష్మ పోషక పదార్థాలు పిల్లలకు ప్రతీరోజూ అందేలా ప్రతీ అంగన్వాడీ కార్యకర్త విధిగా తల్లిదండ్రుల్లో, సమాజంలోనూ అవగాహన కల్గించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. పౌష్టికాహార లోపాన్ని అధిగమించే చర్యలకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేస్తున్నట్టు చెప్పారు, అయినప్పటిక అటవీ ప్రాంతాలు,మారుమూల ప్రాంతాల్లో పౌష్టికాహారలోపంతో పిల్లలు మరణిస్తున్న వైనాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఐసిడిఎస్, సిడిపిఓలు శ్రీలత, వెంకటేశ్వరి మాట్లాడుతూ పిల్లల్లో మానసిక,శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం కీలకమని,ఇది లోపిస్తే ఎదుగుదల లేకపోవడ,అర్థం చేసుకొనే శక్తి కోల్పోవడం, వివిధ వ్యాధులు చుట్టిముట్టడంతో విద్యకు దూరంగా ఉండడం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని పౌష్టికాహారం క్రమ తప్పకుండా అందిస్తు ఒదడమే కాకుండా, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్,సీఆర్ఎం టిలు భాగ్యలక్ష్మి, సైదా, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, పి.శేఖర్, లవకుశ, హరీష్ పాల్గొన్నారు.

చింతపల్లి ఏరియా ఆసుపత్రిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి సమక్షంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ను కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పిటిసి పోతురాజు బాలయ్య లు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఈ మధ్యకాలంలో మాతా, శిశు మరణాలు అధికంగా నమోదు కావడం తెలిసిందే నన్నారు. వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగానే మాతా శిశు మరణాలు రేటు పెరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులుగా ప్రశ్నిస్తే తమపై ఎదురుదాడికి దిగుతున్నారని, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు నిపుణులైన గైనకాలజిస్ట్‌ని నియ మించాలని, అదే క్రమంలో మండలంలో వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరడం జరిగిందన్నారు. కిటుముల పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, పాడేరు ఐటీడీఏ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మత్తు పనులు చేపట్టాలని, అదేవిధంగా కుడుముసారి పంచాయతీ పరిధిలోని కోటగున్నల గ్రామంలో వర్షం కారణంగా కూలిన ఒంటరి మహిళ పాంగి నారాయణమ్మ నివాస గృహం వలన ఆమె దిక్కుతోచని స్థితిలో ఉందని ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తే నివాస గృహం నిర్మించుకోవడానికి దోహదపడుతుందని, అదే విధంగా మారుమూల గిరిజన గ్రామాలకు సిమెంటు రహదారులు, చెక్ డ్యాములు నిర్మాణానికి ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ ను కలిసి లిఖిత పూర్వకంగా వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. స్పందించిన ఆయన ప్రజా ప్రతినిధులు గ్రామాలలో నెలకొన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరలో ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ వారికి హామీ ఇచ్చారు.

చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడం తగదు

విశాలాంధ్ర - చీడికాడ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడం తగదని మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు చంద్రబాబు ఆదేశాల మేరకు మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో బాబుతో నేను కార్యక్రమనికి సంఘీభావంగా రిలే నిరాహార దీక్ష చేసారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చేపట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ పథకానికి వచ్చిన స్పందన లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రలో జనాసమూహాన్ని చూసి ప్రజల దృష్టి మరల్చడానికి చంద్రబాబును అక్రమ అరెస్టు చేశారని అన్నారు టిడిపి నాయకులను అరెస్టు చేసి పబ్బం గడుపుకుంటున్నారన్నారు స్కిల్ డెవలప్మెంట్ లో వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారని దీనిలో ఎటువంటి అవినీతి జరగలేదని యాజమాన్యమే చెప్తుందఅన్నారు చంద్రబాబునాయుడు మచ్చలేని నాయకుడని అలాంటి నాయకుడుపై సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టడం తగదని ఆరోపించారు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు భూదందాలు నాసిరకం రోడ్లు వేసి కమిషన్ తీసుకున్నారని ఆరోపించారు టిడిపి నాయకులు పై ప్రభుత్వం అక్రమ అరెస్టులు ఆపి చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు పోతన చిన్నంనాయుడు బొబ్బది తాతారావు గండి ముసలినాయుడు కొల్లి సూరినాయుడు పోతల రమణమ్మ కర్రీ నాగమణి కొండ అప్పారావు శ్రీరామ్మూర్తి పైలా ముత్యాలనాయుడు పంచాడ దాలినాయుడు సంగంపల్లి అప్పారావు బుద్ధా రమణ గుంపాన ధర్మయ్య పడాల కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండల స్థాయి ఆటలు పోటీలు

విశాలాంధ్ర - ఆనందపురం : స్కూల్ ఫెడరేషన్ (ఎస్.జి. ఎఫ్) ఆధ్వర్యంలో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జడ్పిటిసి కోరాడ వెంకట్రావు స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి ప్రారంభించారు. మండల స్థాయి లో జరిగిన ఆటల పోటీల్లో వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఆనందపురం, గొట్టిపల్లి, బోని, సిర్లపాలెం, గిడిజాల, సొంట్యాం, గండిగుండం రామవరం, వెల్లంకి, బోయపాలెం, తర్లు వాడ, ప్రైవేటు పాఠశాలల న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటిరోజు బాలురు ఆటల పోటీలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాట్మెంటన్, త్రో బాల్, టేన్నికాయిట్, యోగ అట్లాంటిక్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రారంభించి జడ్పిటిసి వెంకట్రావు మాట్లాడుతూ విద్యుత్ తో పాటు ఆటలపై దృష్టి పెట్టాలన్నారు. ఆటల ద్వారా శారీరిక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఇటువంటి క్రీడల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడతాయన్నారు. మండల స్థాయిలో రాణించిన విద్యార్థులు జిల్లా రాష్ట్ర జాతీయస్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచి దేశానికి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు మండల ఉపాధ్యక్షులు పాండ్రంకి శ్రీను, ఆనంద పురం కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ పాండ్రంకి అప్పారావు. మాజీ కోపరేటివ్ డైరెక్టర్ చందక సూరిబాబు, పాఠ శాల కమిటీ చైర్మన్ చందక అప్పల నాయుడు, ఆనందపురం ఉపసర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు బంటుబిల్లి. అప్పలస్వామి , కొట్యాడ రమాదేవి, షినగం పెద్ద రామారావు, చిన రామారావు, చందక అప్పలస్వామి, కొట్టియాడ సత్యమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బయటకు రావాలని పూజలు

విశాలాంధ్ర - మాకవరపాలెం : టిడిపి అధినేత, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు విడుదల కావాలంటూ మాకవర పాలెం మండలం రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద గల వినాయకుడి గుడి వద్ద బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూర్తి, సత్తిబాబు, అర్జున తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయరాలకు సన్మానం

విశాలాంధ్ర - వి.మాడుగుల : జిల్లా ఉత్తమ ఉపాధ్యారాయులిగా అవార్డు పొందిన జిఎం.సుజాతను బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్‌సిఎం బాలికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆమెను పాఠశాల యాజమాన్యం ఏపీటీఎఫ్, యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాలు, పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, గ్రామ సర్పంచ్ యడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, ఎంఈఓ దేవుడమ్మ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ నెల 15 నుండి ప్రభుత్వం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం తాడేపల్లి లోని సిఎం క్యాంప్ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ,మున్సిపల్ కమిషనర్లు, వైద్య, విద్యా శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి, ఈ కార్యక్రమ నిర్వహణకు శాఖల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు అందరూ సమన్వయంతో వ్యవహరిస్తూ మంచి ఫలితాలను సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 15 నుండి వాలంటీర్ల ఇంటింటి ప్రచారము, 16 నుండి ఏ.ఎన్.ఎం./సి.హెచ్.ఓ.ల ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి అవసరమైన శిక్షణను, ప్రచారం సామాగ్రిని, టెస్టింగ్ కిట్లను, ఔషధాలను, అవసరమైన ఇతర సామాగ్రిని ముందుగానే వారికి అందజేయాలని అన్నారు.ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించే సమయంలో సాధారణ వ్యాధులతో పాటు దీరకాలిక వ్యాధులు, బాలింతలు , గర్భిణీలు, తగిన బరువు లేని పిల్లలు, కుష్టు, క్షయ, సంక్రమంచని, సంక్రమించే వ్యాధులతో బాదపడేవారిపై ప్రత్యేక దృష్టి సారించేలా చూడాలన్నారు. సెప్టెంబరు 30 నుండి ప్రతి మండలంలో రోజుకి కనీసం ఒక వైద్య శిభిరం చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా నున్న 685 మండలాల్లో ప్రణాళికా బద్ధంగా ఈ శిభిరాలు నిర్వహించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొదించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులకు ఆయన సూచించారు. ఈ శిభిరాల్లో సాధారణ వైద్యులతో పాటు గైనకాలజీ, పీడియాట్రిక్స్ , ఆర్థో తదితర విబాగాల వైద్య నిపుణులు పాల్గొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె యస్ విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ , డిఎం అండ్ హెచ్ ఓ , డీఈవో పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - అడ్డతీగల : అడ్డతీగల మండల కేంద్రంలో తాపీ పని చేస్తున్న మట్ట ఆంజనేయులు మృ తిచెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయలు సహాయం అందించడం జరిగిందని రంపచోడవరం భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు చీకట్ల సామ్యూల్ తెలిపారు కార్మికులు కష్టాల్లో ఉంటే వారికి అండగా నిలబడతామని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం అడ్డతీగల అధ్యక్షులు నక్క పెంటారావు ఉపాధ్యక్షులు చాగంటి ఆదినారాయణ కార్యదర్శి గుల్లల సురేష్ సంఘం సభ్యులు పాల్గొన్నారు

తెదేపా నాయకుల అరెస్ట్

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేసిన సంద ర్భంగా నిరాహార దీక్ష చేస్తున్న విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, ఉపాధ్యక్షులు నందవరపు సోములు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సతివాడ శంకర్రావు, 92 వార్డ్ అధ్యక్ష కార్యదర్శులు మూర్తి పట్నాయక్, కంపర ఆనంద్‌లను గోపాలపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అప్రమత్తమైన పోలీసులు ఎక్కడికక్కడ నాయకులను గృహనిర్బంధాలు, రోడ్డుపైకి వచ్చేందుకు ప్రయత్నించిన వారిని హౌస్ అరెస్టులు చేశారు. తెలుగు తమ్ముళ్లు ఆగ్రహ జ్వాల రగలటంతో పలు రకాలుగా నిరసన గ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అగ్రశ్రేణి నేతలు అరెస్టుతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు సీఎం డౌన్ డౌన్ అంటూ నిరసన కార్యక్రమాలను చేపట్టారు.

నూతన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - పరవాడ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్న ప్రభుత్వాని దేనని సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అన్నారు. బుధవారం ముత్యాలమ్మపాలెంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సూజాత ముత్యాలు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ప్రభుత్వం వారికి సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన గ్రామ వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పెన్షన్లు అందజేస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, మాజీ ఎంపీటీసి చింతకాయల అమ్మోరు, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, ఎంపిటీసి అర్జిజల్లి దేవిరవి, మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెన్షన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోండి

తాజంగి సర్పంచ్ మహేశ్వరి

విశాలాంధ్ర - చింతపల్లి : వైకాపా ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ సదుపాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాజంగి సర్పంచ్ వంతల మహేశ్వరి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తర్వాత నూతనంగా మంజూరైన 51 పెన్షన్లను అర్హులైన వారికి బుధవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇటువంటి సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తాజంగి మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోరాబు అంగదరావు, పంచాయతీ వార్డు సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర - పరవాడ : వినాయక చవితి పందిళ్లు, మండపాలు ఏర్పాటుకు తప్పని సరిగా పోలీస్ అనుమతులు తీసుకోవాలని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేసారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతితో పాటు నిబంధనలు పాటించాలన్నారు. ఉత్సవాలు ఎన్నిరోజులు నిర్వహిస్తారు. నిమజ్జనం తేది, సమయాలు తెలియ జేయాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 వరకు మాత్రమే తక్కువ శబ్దాలతో మైకులు ఉప యోగించాలన్నారు. మండపాల వద్ద ఉరేగింపు సమయాలలో ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన మండపాల వద్ద అగ్నిప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని, వీలైనంతవరకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. నిమజ్జనం సమయంలో వాహన డ్రైవర్లు మద్యం సేవించకుండా, సరైన డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండేలా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఊరేగింపుల్లో అశ్లీల నృత్యాలు, బాణాసంచా కాల్పులకు అనుమతి లేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ వెల్లడించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం : శాసన సభ్యులు భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - జీకే విధి : వైకాపా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెదవలస గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలన వ్యవస్థలో వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన మార్పులకు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నా యన్నారు. ఈ రోజు దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ గ్రామ సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రతి రాష్ట్రం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఇటువంటి అద్భుత పరి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి, చింతపల్లి ఎంపీపీ లు బోయిన కుమారి, కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యులు శివరత్నం, పోతురాజు బాలయ్య, పెదవలస సర్పంచ్ వంశీకృష్ణ, మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ కుమారి, వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, పిఎసిఎస్ చైర్మన్ ప్రసాద్, గ్రామ పెద్దలు శరబన్న, పెద్దన్న, వైస్ ఎంపీపీ యల్ దేముడు, త్రిమూర్తులు, సర్పంచు కే రామకృష్ణ, వ్యవసాయ మండల చైర్మన్ పి పాండు, ఎంపీటీసీ మత్స్యరాజు, కన్వీనర్ పి కృష్ణమూర్తి,, కో కన్వీనర్ ఎల్ రమేష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబెర్ కే. గిరిప్రసాద్, మాజీ సర్పంచ్ ఎం.రామారావు, నాయకులు కే శ్రీరాములు, రాము,దొరబాబు, సోములమ్మ, కె.రామారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్ట్ అక్రమం

లోకేష్‌కు మద్దతు తెలిపిన జనసేన నేతలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమం అని జనసేన నేతలు అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని బుధవారం రాజమండ్రిలో జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు, జీవీఎంసీ 22 వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కలిసి వారికి సంఘీభావం తెలియజేసారు. ఈ సందర్భంగా చోడవరం జనసేన పార్టీ ఇంచార్జ్ పీవీఎస్ఎన్ రాజు లోకేష్ తో మాట్లాడుతూ ప్రస్తుత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వ్యవస్థల్ని అడ్డుపెట్టుకుని ముఖ్యంగా పోలీసు వ్యవస్థ ద్వారా ప్రతిపక్షాలని అంచివేయాలని చూడటం చాల దుర్మార్గం అన్నారు. వైసీపి ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ఈ నిరంకుశ అవినీతి వైకాపా ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రతిపక్షాలు కలిసి పోరాడాలని లోకేష్ చెప్పడం జరిగిందన్నారు. కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేదా అని అనుమానం కలుగుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రజల్లో వైసీపి పార్టీ మీద వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక దొడ్డిదారుల్లో ప్రతిపక్ష నేతను సైతం కేసులు పెట్టి అరెస్టు చేశారని, టిడిపి చేస్తున్న న్యాయపోరాటానికి జనసేన అండగా నిలబడుతుందన్నారు. మా అధినేత పవన్ కళ్యాణ్ టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్ కు తన సంఘీభావం తెలియజేశారని , టిడిపి కుటుంబ సభ్యులకు జనసేన నేతల అండ ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కష్టకాలంలో పార్టీలన్నీ ఒక తాటి మీదకు వచ్చి ఈ దుర్మార్గపు అరాచక వాదుల బడతం పట్టాలన్నారు.

ఓఎస్‌జీ ఫౌండేషన్ మరియు స్నేహ మిత్ర ఆర్మీ యూత్ క్లబ్ సంయుక్త మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం : అనందపురం మండలం గంభీరం పంచాయతీ ఓ ఎస్ జీ ఫౌండేషన్ మరియు స్నేహ మిత్ర ఆర్మీ యూత్ క్లబ్ సంయుక్తంగా న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్ సముక్తంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు దీనికి ముఖ్య అతిథిగా హాజరైన గోండు సీతారాం చైల్డ్ రైట్స్ కమిషనర్, డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ యస్ రేణుకయ్య విచ్చేశారు నూతనంగా ఏర్పడిన స్నేహ మిత్ర ఆర్మీ యూత్ క్లబ్ వారిని అభినందిస్తూ ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చెయ్యడం దానికి మనల్ని ఆ మాకు ఎంతో సంతోషంగా ఉంది అని ఇరు సంస్థలను కొనియాడారు మీ వంటి యువత సేవ అనే మార్గం ఎన్నుకోవడం మంచి విషయం అని తెలియజేశారు, ఓ ఎస్ జీ ఫౌండేషన్ శివ దళాయి కి ఇది 32 వా రక్తదాన శిబిరం ఇప్పటికే గతంలో 1821 యూనిట్ల సేకరించం ఈ రోజు రక్తదాన చేసిన వారితో కలిపి 1845 శివ 13 సార్లు రక్తదానం చేశారు,అదే విధంగా స్నేహ మిత్ర ఆర్మీ యూత్ క్లబ్ రాజేష్ కూడా ఎన్నో స్వచంద రక్తదాన శిబిరాలు నిర్వహించి తను కూడా ఒక సమస్త ప్రారంభించడం మంచి ఉదేసం అని పేర్కొన్నారు భీమిలి నియోగికవర్గంలో తరచూ శిబిరాలు నిర్వహించి మా మీద గౌరవంతో వచ్చిన రక్త దాతలకు మా సంస్థ నుంచి పాదాభివందనం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దినేష్, రాజేష్, చందు, సాయి, మధురిమ, శ్యామ్ పాల్గొన్నారు.

చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారు

విశాలాంధ్ర - వి.మాడుగుల : చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని మాడుగుల నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పివిజి.కుమార్, టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. బుధవారం మాడుగులలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆధ్వర్యంలో బాబు గారికి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ముందుగా బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. తక్షణమే చంద్రబాబును విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డికి ఉన్న అవినీతి మరకలు చంద్రబాబునాయుడుకు కూడా అంటించాలనే దురుద్దేశంతోనే ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబునాయుడును వేధిస్తున్నారని, ఇటువంటి సంక్షోబాలను ఎదుర్కోవడం చంద్రబాబునాయుడుకు కొత్త ఏమి కాదని, కడిగిన ముత్యంల బయటకు రావడం ఖాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు కూడా చంద్రబాబు నాయుడుకు జరిగిన అన్యాయం గురించి తీవ్రంగా చర్చిస్తున్నారన్నారు. దేశంలోనే క్రమశిక్షణ గల నాయకుడు చంద్రబాబు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమలో టిడిపి నాయకులు అద్దేపల్లి జగ్గారావు, పుప్పాల అప్పలరాజు, ఉండూరు దేముడు, నందారపు సన్యాసిరావు, వద్దాది రంజిత్ వర్మ. లెక్కల కాశిబాబు, పుప్పాల రమేష్, ఢిల్లీ నానాజీ, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ క్షణంలో వచ్చినా ప్రతి కార్యకర్త సైనికుడిలా సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో కుమారి కళ్యాణ మండపంలో 91, 92 వార్డుల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని ప్రతి కార్యకర్త సైనికుడై సంసిద్ధంగా ఉండాలని ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు తెలియజేస్తూ అందరినీ కలుపుకుంటూ ఏ ఒక్కరిని ఏ అవసరం వచ్చిన స్థానిక పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఎల్లప్పుడూ మనకు అందుబాటులో ఉంటారని కార్యకర్తలు అందరూ గౌరవంగా తలెత్తుకొని గర్వంగా చెప్పుకునే పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు మళ్ళీ తిరిగి లేని విజయం సాధించాలంటే మీరంతా పార్టీ జెండాను భుజాలపై మోసి అత్యున్నత స్థాయిలో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలను నాయకులుగా చేసే ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92 వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ 91, 92 వార్డుల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు కన్వీనర్లు, ఆర్పీలు, వివిధ అనుబంధ సంస్థల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెందుర్తిలో 'మేరా మట్టి - మేరా దేశ్'



విశాలాంధ్ర - పెందుర్తి : మేరా మట్టి - మేరా దేశ్ (నా భూమి - నా దేశం) కార్యక్రమం పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని వేపగుంట, 96వార్డు చిన్న ముసిడివాడలలో బుధవారం బిజెపి నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. 95వార్డు బిజెపి నాయకులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు పాల్గొని మాట్లాడుతూ బిజెపి విధానాలను ప్రజలకు వివరించి మన దేశం మనమట్టి గొప్పతనాన్ని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం అన్ని రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో బిజెపి కేంద్రంలోనూ ఇటు తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంచిపాటి వెంకట సన్యాసిరావు ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఎర్ర అచ్చం నాయుడు, పెందుర్తి రూరల్ మండలం అధ్యక్షులు కాళ్ళ జగన్మోహన్ కార్యకర్తలు పాల్గొన్నారు.